రంగుల పుట్టిల్లు..



ముక్కాల ఇంద్రాణికి మొదటి బహుమతి అందజేస్తున్న సాంటిరెడ్డి పున్నారెడ్డి



జి.లక్ష్మి ద్వితీయ బహుమతి అందజేస్తున్న చైతన్య





ముగ్గుల పోటీలు.. రంగుల లోగిళ్లు

వాకిట విరిసే హరివిల్లు



సాక్షి ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల్లో పాల్గొని ముగ్గులు వేస్తూ..

కుత్బుల్లాపూర్/సుభాష్‌నగర్: సంక్రాంతి సంబరాలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వారం రోజుల ముందుగానే జరుపుకున్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని చిత్తరమ్మదేవినగర్ (పీపీ నగర్) రోడ్డు నం.4లో 'సాక్షి'ఆధ్వర్యంలో సాంటిరెడ్డి పున్నారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ (ఎస్పీఆర్) సౌజన్యంతో సంక్రాంతి సంబరాల ముగ్గుల పోటీలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు జరిగిన ఈ ముగ్గుల పోటీల్లో సుమారు 40 మంది మహిళలు పోటీపడి ముగ్గులు వేశారు. సంక్రాంతిని ఉట్టిపడేలా కొంతమంది మహిళలు వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. న్యాయ నిర్ణయాలుగా లక్ష్మీదేవి, ప్రసన్న, షకీల వ్యవహరించి ముగ్గురు వేసిన వారి వద్దకు వెళ్లి వాటిని పరిశీలించి చుక్కల ముగ్గులకు ప్రాధాన్యం ఇచ్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సలేషన్ బహుమతులను ప్రకటించారు. ఆ ప్రాంతమంతా సంక్రాంతి సంబరాలు జరుగుతున్న వాతావరణం కనిపించింది.

ముగ్గుల పోటీల విజేతలు వీరే..

నువ్వా నేనా అన్నట్లు సాగిన ముగ్గుల పోటీలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ముగ్గులు వేయడంతో ఆ ప్రాంతమంతా సంక్రాంతి శోభను సంతరించింది. ప్రథమ బహుమతి ముక్కాల ఇంద్రాణి (కొత్తపేట, ఎల్బీనగర్), ద్వితీయ జి.లక్ష్మి (చిత్తరమ్మదేవినగర్) తృతీయ బహుమతి ఎస్.శ్యామల (గాజులరామారం), ఉత్తమ టాలెంట్ కవితను ఎంపిక చేశారు. వీరికి ఎస్పీఆర్ సంస్థ అధ్యక్షుడు సాంటిరెడ్డి పున్నారెడ్డి, చైతన్య దంపతులు బహుమతులు అందజేశారు. విజేతలతో పాటు పాల్గొన్న అందరికీ చీరలు పంపిణీ చేశారు. సాక్షి ప్రతినిధులతో పాటు స్థానిక నాయకులు నాయబ్ రసూల్, లాల్ మొహమ్మద్, చందు, రాజు, మధు, సైదారెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొని ఏర్పాట్లను







తెలుగు ముంగిళ్లు



శ్యామలకు తృతీయ బహుమతి అందజేస్తున్న లాల్ మహ్మద్, నాయబ్ రసూల్



కన్సలేషన్ బహుమతి అందజేస్తున్న సాక్షి ప్రతినిధి

సంక్రాంతి అంటేనే ముగ్గుల పండుగ..



తెలుగు ప్రజలు జరుపుకునే అతిపెద్ద పండగలలో సంక్రాంతి పండుగ ప్రాముఖ్యత నేటి తరానికి తెలియజేయడానికి ×సాక్షి×తో కలిసి ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం సంతోషంగా ఉంది. ఎస్పీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మునుముందు ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేపడతాం. ఇప్పటికే తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వస్తున్నాం. సామాజిక సేవ చేసేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటాం..

– సాంటిరెడ్డి పున్నారెడ్డి, ఎస్పీఆర్ ట్రస్ట్ చైర్మన్..





ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలు, పాల్గొన్న వారితో నిర్వాహకులు

నేటి కంప్యూటర్ యుగంలో..



పర్యావేక్షణ సంక్రాంతి పండగ పురస్కరించుకొని మహిళలకు సాక్షి, ఎస్పీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం. ఈ ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున హాజరై రంగవల్లికలను ఉత్సాహంగా వేశారు. నేటి కంప్యూటర్ యుగంలో కనుమరుగున పడుతున్న ముగ్గులకు జీవం పోసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయి.

– చైతన్య, చిత్తారమ్మ దేవినగర్..

సమాచారం

25 మందికి కోవిడ్ నెగిటివ్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజవకర్గ పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 25మందికి పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చాయని వైద్యాధికారులు తెలిపారు. తీవ్రజ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పుల లక్షణాలతో బాధపడేవారు వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దుండిగల్ పీహెచ్‌సీ, షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీల్లో సైతం కోవిడ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని మండల వైద్యాధికారి నిర్మల తెలిపారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ 27వ వార్డు కౌన్సిలర్ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో దుండిగల్ తాండాలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్యులు శివరాజ్ పెడ్స్, స్పందన 202 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి ఆస్పత్రి మేనేజర్ రవికిరణ్, స్థానిక నాయకులు రవీందర్‌నాయక్, అమర్‌సింగ్‌నాయక్, శాంత, ప్రవీణ్‌నాయక్, జగన్‌నాయక్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం

నిజాంపేట్: బాచుపల్లిలోని మమత అకాడమి ఆఫ్ మెడికల్ సైన్స్ ఆస్పత్రి ప్రతినిధులు గురువారం నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 8న ప్రగతినగర్‌లోని ధ్యాన్హిత స్కూల్‌లో ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించాల్సిందిగా ఆస్పత్రి చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఆనంద్‌బాబుకు ఆహ్వానపత్రికను అందజేశారు. అదే విధంగా కార్పొరేటర్లు చిట్ల దివాకర్, బాలాజీ నాయక్‌లు మేమర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రమోద్‌రెడ్డి, బెంజిమెన్‌పాల్ తదితరులు ఉన్నారు.

జిల్లాలో బీజేపీ బలోపేతం దిశగా అడుగులు

కుత్బుల్లాపూర్: మేడ్చల్ జిల్లాలో బీజేపీ బలోపేతం చేసే దిశగా పార్టీ అధినాయకత్వం అడుగులు వేస్తోంది. గురువారం మేడ్చల్–మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి నూతన కార్యవర్గాన్ని ప్రకటించగా కుత్బుల్లాపూర్ ప్రాంతానికి ప్రాధాన్యం కల్పించారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్‌లుగా బక్క శంకర్‌రెడ్డి(సూరారం), గరిగే శేఖర్‌ముదిరాజ్ (రంగారెడ్డినగర్), జిల్లా ప్రధాన కార్యదర్శులుగా చింతల మణిక్యరెడ్డి(అల్వాల్), పొపూరి జగన్‌మోహన్‌రావు (రంగారెడ్డినగర్), జిల్లా స్పోక్‌పర్సన్‌గా మేకల సురేష్‌రెడ్డి (జగద్గిరిగుట్ట), కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఎస్సీ మోర్చా కన్వీనర్‌గా ముత్యపాగ విజయ్(గాజులరామారం)లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు అందజేస్తున్న కార్పొరేటర్ జగన్, సంక్షేమ సంఘం సభ్యులు

జగద్గిరిగుట్ట: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ జగన్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని మైసమ్మనగర్–బి బ్లాక్ కమిటీ హాలులో సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్ లతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు మౌనిక, పుష్ప కావ్య వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రెసిడెంట్ పిల్లి ఆంజనేయులు, జనరల్ సెక్రటరీ బండారి రవీందర్‌రెడ్డి, కోశాధికారి జమేదార్ సంతోష్, స్థానిక నాయకులు హనుమంతు, పాపిరెడ్డి, వివేక్, కురుమా రెడ్డి, టైల్స్ శ్రీనివాస్ రెడ్డి, రాజయ్యగుప్తా, రమేష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో 6,12,700 మంది ఓటర్లు

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య ముసాయిదాను విడుదల చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 6,12,700 ఓటర్లు ఉన్నట్లుగా నిర్ధారించారు. గతంలో ఇక్కడ ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలుకుని, బూత్ లెవెల్ సిబ్బందితో ఇంటింటి సర్వే నిర్వహించి పూర్తి స్థాయి నివేదిక ఆధారంగా సుమారు 70 వేలకు పైగా ఓట్లను తొలగించారు. ఎన్నికల అధికారుల సూచన మేరకు డిసెంబర్ 5వ తేదీన ప్రకటించిన తుది జాబితా విడుదల చేశారు. మొత్తం పురుషులు 3,22,566 ఉండగా.. స్త్రీలు 2,90,010, ట్రాన్స్‌జెండర్లు 124 మంది ఉన్నారని నిర్ధారించారు. మొత్తం 452 మంది బీఎల్‌ఓ లతో సర్వే నిర్వహించిన అనంతరం తుది జాబితాను ఉన్నతాధికారులకు పంపారు.

గతంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని లక్ష ఓట్లకు పైగా డబల్, ఒకే ఫొటోతో కూడిన ఓట్లు ఉన్నాయని గుర్తించిన అధికారులు అందులో సుమారు 70 శాతం తొలగించినట్లు పేర్కొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



ఎమ్మెల్యేకు జీవో.59లో జరిగిన అవకతవకలను వివరిస్తున్న గాంధీనగర్ అసోసియేషన్ నాయకులు

రంగారెడ్డినగర్: పేదల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాంధీనగర్ సంక్షేమ సంఘం సభ్యులు గురువారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. జీవో నం.59 కింద దరఖాస్తు చేసుకున్న గాంధీనగర్ ప్రాంతానికి చెందిన దరఖాస్తుదారునికి 80 గజాల గాను రూ.5.30,800 చెల్లించాలని రెవెన్యూ అధికారులు నోటీసులు పంపారు. అదే విధంగా పలువురికి పెద్ద మొత్తంలో చెల్లించాలని తాకీదులు అందడంతో గాంధీనగర్ సంక్షేమ సంఘం నాయకుడు జల్దా లక్ష్మీనాథ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన ఆయన ఆర్డీఓతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు తుమ్మ శ్రీనివాస్, ఆనంద్, సాయి తదితరులు ఉన్నారు.

కోల్ నాలా నిర్మాణ పనుల పరిశీలన



పేట్‌బషీరాబాద్‌లో కోల్ నాలా పనులను పరిశీలిస్తున్న వాటర్‌వర్క్స్ మేనేజర్ రాజు

చింతల్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్ పరిధిలో ఎస్ఎన్‌డీపీ నిదులతో చేపడుతున్న కోల్ నాలా నిర్మాణ పనులను గురువారం జీడిమెట్ల వాటర్‌వర్క్స్ సెక్షన్ మేనేజర్ రాజు పరిశీలించారు. ఈ కోల్ నాలా పక్కనే గోదావరి జలాల పైపులైన్‌లు ఉండటంతో వాటికి ఎలాంటి డామేజీ కాకుండా పనులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ... కోల్ నాలా నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ నాలా పూర్తయితే లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

ఆలయ హుండీ లెక్కింపు



శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ డబ్బులు లెక్కిస్తున్న దృశ్యం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపును గురువారం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారి వీవీ సుబ్రమణ్యం హాజరై ఐదు నెలల హుండీని విప్పగా స్థానిక నాయకులు మల్లేష్, సుధాకర్‌రావు, పాపిరెడ్డి, సంజీవరెడ్డి, ఆలయ అర్చకులు రామాచార్యులు, విజయకుమారాచార్యుల సమక్షంలో లెక్కింపు చేపట్టారు. మొత్తం 3లక్షల 52 వేల 254 రూపాయల హుండీ ఆదాయం సమకూరినట్లు ఆలయ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ జె.కృష్ణమాచార్యులు తెలిపారు.

బూత్‌కమిటీల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న డీకే అరుణ

దుండిగల్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఈనెల 7వ తేదీన జరిగే బూత్ కమిటీల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ కోరారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్ ఆధ్వర్యంలో గండిమైసమ్మలో గురువారం జరిగిన నిజాంపేట్ కార్పొరేషన్, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సమావేశానికి ముఖ్య అతిథులుగా డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ... రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేయాలంటే బూత్ స్థాయిలో పార్టీని మరింత పటిష్ఠం చేయాలన్నారు. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో వర్చువల్‌లో జరగనున్న బూత్ కమిటీల సమ్మేళనంలో ప్రతి బూత్ నుంచి బీజేపీ శ్రేణులు పాల్గొనాలన్నారు. అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... స్థానికంగా నెలకొన్న సమస్యల పట్ల పోరాటం చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల అరాచకాలను ఎండగడుతూ ప్రజలకు అండగా నిలవాలని సూచించారు.

◆ ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, పార్లమెంట్ కన్వీనర్ ఆర్‌కే శ్రీనివాస్, కో–కన్వీనర్ రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, గిరిజన మోర్చా నాయకులు దాసరి శ్యామ్‌రావ్, రామచంద్ర నాయక్, నిజాంపేట్ అధ్యక్షుడు ఆకుల సతీష్, దుండిగల్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, కొంపల్లి అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సెన్సార్ బోర్డు సభ్యురాలు సరితారావ్, కౌన్సిలర్లు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలకు.. తూట్లు!

డ్రైవింగ్ సమయాల్లో ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించని వాహనదారులు

- రాంగ్ రూట్‌లో అడ్డదిడ్డంగా వస్తున్న వాహనాలు
- నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం
- ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో జామ్
- సమస్యను పరిష్కరించాలని కోరుతున్న వాహనదారులు



నిజాంపేట్ వాటర్ ట్యాంక్ వద్ద డివైడర్‌ను దాటుతున్న ద్విచక్ర వాహనదారుడు(సర్కిల్‌లో..)



నిజాంపేట్ పెట్రోల్ బంక్ వద్ద రాంగ్ రూట్‌లో రోడ్డును క్రాస్ చేస్తున్న వాహనదారులు

నిజాంపేట్: అభివృద్ధి పనుల నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నా కొందరు వాహనదారులు నిబంధనలు పాటించకుండా రాంగ్ రూట్‌లో రాకపోకలకు తెర లేపుతున్నారు. దీంతో ట్రాఫిక్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులతో ట్రాఫిక్‌కు మళ్లిస్తున్నారు. అయితే పనులు జరుగుతున్న ప్రాంతాల్లో బారికేడ్లను ఏర్పాటు చేయకపోవడంతో కొందరు వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళ్తూ మిగతా వాహనదారులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. అంతే కాకుండా డివైడర్లను క్రాస్ చేసే సమయంలో ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో నిజాంపేట్ నుంచి బాచుపల్లి రోడ్డులో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది.

ట్రాఫిక్ సిబ్బంది లేక...

ఎస్ఎన్‌డీపీ నాలా పనుల్లో భాగంగా వరదనీరు సాఫీగా వెళ్లేందుకు నిజాంపేట్ ఆచార్యకుంట నుంచి బాటా షోరూమ్ వరకు 500 మీటర్ల మేర 3.5 మీటర్ల లోతు, 3 మీటర్ల వెడల్పు నాలా పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఈఈ నారాయణ వినతి మేరకు సైబరాబాద్



సైబరాబాద్ ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన రూట్ మ్యాప్

డిప్యూటీ ట్రాఫిక్ కమిషనర్ శ్రీనివాస్‌రావు 30 రోజుల పాటు ట్రాఫిక్‌ను మళ్లిస్తూ నవంబరు 14వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. బాచుపల్లి నుంచి నిజాంపేట్‌కు వాహనదారులు రాకపోకలు సాగించేందుకు వీలుగా నిజాంపేట్‌లోని హెచ్ఎండబ్ల్యూఎస్ వాటర్ ట్యాంక్ సమీపంలో ఎడమ వైపు కేఎస్ఆర్ గార్డెన్ వ్యాలీ రోడ్డు మీదుగా వయా ఎస్ఆర్ఐ కళాశాల నుంచి తిరిగి నిజాంపేట్ ప్రధాన రోడ్డుకు ట్రాఫిక్‌కు మళ్లించే ఏర్పాట్లు చేశారు. అయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బందిని నియమించకపోవడంతో వాహనదారులు నిబంధనలను పాటించడం లేదు. రోడ్డుకు ఇరువైపులా ఇష్టానుసారంగా రాంగ్ రూట్లలో రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు వాహనదారులు బాధ్యతారహిత్యంగా వ్యవహరించడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. నిజాంపేట్ వాటర్ ట్యాంక్, పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో ఎక్కువగా వాహనదారులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

చేపట్టాల్సిన చర్యలు..

- వాహనాల మళ్లింపు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ కంట్రోల్ చేయాలి. శ్రీరామ్‌కుంట వద్ద డబుల్ బెడ్రూమ్ గృహ సముదాయం, జర్నలిస్ట్ కాలనీ నుంచి వచ్చే వాహనాలను శ్రీరామ్‌కుంట పక్క నుంచి మళ్లించాలి.
- నిజాంపేట్ నుంచి బాచుపల్లి వైపు వెళ్లే వాహనాలు రాంగ్‌రూట్‌లో వెళ్లకుండా కట్టడి చేయాలి.
- ఎస్ఎన్‌డీపీ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో డివైడర్లను క్రాస్ చేయకుండా ఈ ప్రాంతాలను మూసివేయాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు తప్పనిసరిగా విధులు నిర్వహిస్తూ ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలి.